# "అసమానదైవం"

## అనిర్వచనీయ ప్రభావం !

దైవ నామం మనల్ని ప్రభావితం చేస్తుంది. దైవ నామ స్మరణం మనలో ఓ నూతనోత్తేజాన్ని నింపుతుంది. దైవ పలుకుల్లోని సృజనాత్మకత నవ్యత మానవ కోటి జీవన శైలినే మార్చివేస్తుంది. ఇలాంటి దైవ లక్షణాలు కల విమోచకుడే "అసమాన దైవం" యేసు క్రీస్తు ప్రభువులో ఇవన్నీ సమగ్రంగా సమ్మిళితమై ఉన్నాయి. అందుకే అయనకు "అసమాన దైవం" అన్న నామధేయం ఉంది. జ్యోతిర్మయుడైనే యేసుక్రీస్తు ప్రభువు అసమాన కార్యాలను క్యాసెట్, సి.డి.ల రూపేణా జనాళికి అందించాలన్న సదుద్దేశంతో "అసమాన దైవం" అనే ఈ కొత్త క్యాసెట్, సి.డి.ని వెలువరిస్తున్నాము.

మహిమాన్వితుడైన యేసుక్రీస్తు ప్రభులోని ప్రభావ మహత్యాల్ని అమితంగా విశ్వసించే సోదరుడు కలపాటి రాజశేఖర్‌గారు. కలపాటి కుటుంబాల పక్షాన ఈ బృహత్ప్రణాళికకు సంకల్పించారు. రాజశేఖర్‌గారిలోని అచంచల దీక్ష ప్రశంసనీయం ప్రచారార్భటిని సమ్మతించని కలపాటి కృషి బహుదా అభినందనీయం. లోగడ వీరు దేవుడు పుట్టాడు, శిలువ విజయం, దైవారాధన, యేసులోని మాధుర్యం, మొదలగు క్యాసెట్‌లను, సి.డిలను క్రైస్తవ జన సముదాయానికందించి సాహితీ సంగీత రంగాలలో ఒక నవీన ఒరవడికి అంకురార్పణ చేసి క్రైస్తవ ఆరాధనలో క్రొత్త విధానాన్ని సూచించారు. వారి మహోన్నత ఆశయాలకు క్రైస్తవ సంఘాలు బాసటగా నిలిచి మన ప్రభువు ఇంకా ఎక్కువగా మహిమపరచబడాలని కాంక్షిద్దాం. దేవుడు వారి విశ్వాసాన్ని ప్రయత్నాల్ని సఫలీకృతం చేసి వారి కుటుంబాన్ని అమితంగా ఆశీర్వదించి అభివృద్ధి పరచాలని ప్రార్థిద్దాం.

కలపాటి వారి పాటలకు సంగీతాన్ని సమకూర్చి సంగీత రంగంలో సుస్వరాల సవ్వడి వినిపించి విశ్వాసులకు ఆత్మీయ ఆశీర్వాదాలకు ఆలంబనంగా నిలిచారు పి.జె.డి కుమార్‌గారు. ఎంత పనుల ఒత్తిడి ఉన్నా అడిగినంతనే పాటల ఒడిలో ఒదిగిపోజేయగల అద్భుతమైన



వరం పి.జె.డి గారిలో ఉంది. ప్రీతి పాత్రంగా శృతిపేయంగా రాగాలను పలికించి స్వరాల్ని ఒలికించి తన్మయులను చేయగల సామర్థ్యం పి.జె.డి గారిలో పుష్కలంగా ఉంది.

సాహితీ, సంగీత క్షేత్రాల్లో అభిరుచి అవగాహన కలిగిన అమృతవాణి స్టూడియో సౌండ్ ఇంజినీయర్ శ్రీ టి. సుధాకర్‌రెడ్డి గారిని అభినందించకుండా ఉండలేకపోతున్నాను. ఎందుకంటే ఎంత మంచి సాహిత్యమైనా, ఎంత ఉన్నతమైన బాణీయైనా, ఎంత మధుర గాత్రమైనా అన్నింటినీ రంగరించి సమున్నత గీతాన్ని అందించగలిగే ప్రత్యేకత వారిలో నిక్షిప్తమై ఉంది.

ఈ "అసమాన దైవం" క్యాసెట్, సి.డి ఆవిష్కరణ శుభసందర్భంలో పరమాధ్యక్షుడైన క్రీస్తు ప్రభువు ఈ క్యాసెట్‌ను, సి.డిలను పారలౌకికాశీస్సులతో నింపి అలౌకికానందానుభూతిని అందించాలని విన్నవించుకొంటున్నాను.

అసమాన దైవం క్యాసెట్‌కు, సి.డి.లకు వ్యాఖ్యానాలు, పాటలు నా లేఖనిలోంచి జాలువారడం మహద్భాగ్యంగా భావిస్తున్నాను. ఒక సంవత్సరం కాలం పాటు యిందులోని వ్యాఖ్యానాల్ని, గీతాల్ని రాశాను. రచనలకు ఉపక్రమించే ముందు ఎన్నో రోజులు నా ప్రాణ ప్రియుడైన క్రీస్తుప్రభుని సాన్నిధ్యంలో నడిపింపుకై పడిగాపులు కాశాను. దేవుడే నా చేయి పట్టుకొని ఈ వ్యాఖ్యానాల్ని, సంకీర్తనల్ని రాయించారు. యిందులోని రచనలు ప్రభువు మహిమార్థమై చిరస్థాయిగా నిలిచిపోతాయన్నది నా ప్రగాఢ విశ్వాసం. సెలయేటిలాంటి నిష్కల్మష హృదయులు కలపాటి గారికి స్వరకెరటాలెగరవేసిన తమ్ముడు పి.జె.డి.కి నా హార్దికాభినందనలు.

అసమానదైవం అనిర్వచనీయ ఆశీస్సులు అందరికీ సౌలభ్యం కావాలన్నది నా ప్రార్థన.

16-13-07
"గంధం సౌధం"
హైదరాబాదు - 79

**డా॥ గంధం వేదవేశ్వరరావు**

# యేసే "అసమాన దైవం"

## అసమాన దైవం :

నేను మొదటివాడను కడపటివాడను, జీవించువాడను మృతుడనైతిని గానీ ప్రకటన 1:18
ఇదిగో యుగయుగములు సజీవుడనైయున్నాను. యుగయుగాలలో సజీవదైవంగా యున్న త్రియేక దేవుని కీర్తించి కొనియాడటం మానవకోటికి మహద్భాగ్యం. వర్తమాన, భూత, భవిష్యత్ కాలాలలో సర్వమానవాళిని అత్యంత ప్రభావితం కీర్తన 71:19
చేసిన అసమానదైవం ప్రభువైన యేసుక్రీస్తే. అందుకే కీర్తన 71:19లో గొప్ప కార్యములు చేయు దేవా నీకు సాటియైన వాడెవడు అంటూ భక్తుడైన దావీదు దేవుని ఘనతను పాడి కీర్తించాడు. యెహోవా, వేల్పులలో నీవంటి వాడెవడు? పరిశుద్ధతను బట్టి నీవు మహనీయుడవు. స్తుతి కీర్తనను బట్టి పూజ్యుడవు. అద్భుతములు చేయువాడవు. నీవంటి వాడెవడు. అంటూ సవాలుతో కూడిన సంగీతాలాపన చేశారు ఆనాడు మోషే మరియు ఇశ్రాయేలీయులు. సర్వకాలాల్లో రాజైన క్రీస్తు ప్రభునికి ఇలా స్వరాభిషేకం చేయటం ద్వారా నిత్య సత్యదేవుని కరుణా సంపన్నతను కీర్తించి కొనియాడటం మూలంగా ప్రభువు ప్రసన్నుడవుతాడని ఆశిస్తున్నాము. ఆ ఉద్దేశ్యంతోనే ఈ "అసమానదైవం" క్యాసెట్ మరియు సి.డి.లను కలపాటి కుటుంబం పక్షాన సహోదరులు కలపాటి రాజశేఖర్‌గారు వెలువరించటం క్రైస్తవ సంగీత ప్రియులకు ఒక సువర్ణవకాశం. ప్రభువు మహిమార్థమై ఈ ఐదవ క్యాసెట్ మరియు సి.డి. "అసమాన దైవం" రూపొందించటం అభినందనీయం. డా॥ గంథం వేదవేశ్వరరావు గారు పాటలు వ్యాఖ్యానం వ్రాయటం గొప్ప ఆశీర్వాదం. స్వరశిల్పి సహోదరుడు పి.జె.డి. కుమార్‌గారి ప్రీతిపాత్రమైన రాగాల సవ్వడి ఈ క్యాసెట్, సి.డి.లోని రాగమాలికలకు ప్రత్యేక ఆకర్షణ. అసమానదైవం క్యాసెట్, సి.డి.ల్లోని పాటలు సహోదరులు విల్సన్ హెరాల్డ్, రమణ, సునీల్, వసంత్ ఇమ్మానుయేల్, ప్రవీణ్‌దత్, సోదరీమణులు నిత్య, సుజాత, శౌరీలు, ప్రీతి మరియు జయశ్రీ బృందంవారు ఆలపించగా సహోదరులు రవివర్మగారు, సహోదరులు యార్లగడ్డ జాన్‌రాయ్ గారు వ్యాఖ్యానించారు. అసమానదైవం పాటలను మీరు వింటున్నప్పుడెల్ల అసమానుడైన ప్రభువు బహుగా ప్రస్తుతించబడాలని బైబిలును గురించిన అవగాహన, జ్ఞానం ప్రతి ఒక్కరికి కలగాలన్నదే వారి ప్రధానోద్దేశం. "అసమాన దైవం" అద్వితీయుడైన ప్రభువు అసంఖ్యాక ఆశీర్వాదాలు సదా మనకు కలుగును గాక, ఆమేన్.

**– బ్రదర్ యార్లగడ్డ జాన్‌రాయ్**



## 1. సృష్టి

దేవుని సృష్టి అత్యంత రమణీయమైంది. నింగి, నేల, తారకలు, సముద్రం అ.కా.
మొదలైనవి సృష్టిలోని వింతలు, అవన్నీ త్రియేక దేవుని ద్వారానే సృజించబడ్డాయి. 1:1-31,
జీవము గల పశువులు, జంతువులు, పురుగులను ఆరవ దినమందు చేశాడు 2:1-3
ప్రభువు. అన్నీ సృజించినా, దేవుని సృజనాత్మక శక్తిలోని మహత్యం ఆ దినాన మానవుని సృజించటంతోనే ప్రస్ఫుటమౌతుంది. అవును, దేవుని మానవతా దృక్పదం, మానవతావాదం సుసంపన్నమైంది. వాటిని గూర్చి ఇప్పుడు విందామా?

పల్లవి : పరమాద్భుతముగా పరమజ్ఞానియగు దేవుడు
ఆదిలోన సృజియించిన సృష్టి విధానము ఇదియే

1. ఆదిలోన రూపించెను నింగిని నేలను
వెలుగు చీకటులను వేరుపరచెను
పగలనియు రాత్రనియు వాటిని పిలిచెను
మొదటి దినమునందున చేసెను ఈ అద్భుతము

2. జలముల మధ్యలో విశాలమును చేసెను
జల నిధులను ప్రభువు వేరుపరచెను
ఆ మహా విశాలంబును ఆకాశమనెను
రెండవ దినమందున చేసెను ఈ అద్భుతము

3. ఆరిన నేలను పొంగే సముద్రమును
గడ్డిని విత్తనములిచ్చు వృక్షజాతులను
ఫలములిచ్చు చెట్లను సృజియించెను
మూడవ దినమందున చేసెను ఈ అద్భుతము

4. ఆకాశమందున వెలయించె జ్యోతులను
పగలు వెలుగిచ్చుటకు సూర్యగోళమును
ఋతువుల సూచించుటకు చందురుని చేసెను
నాల్గవ దినమందున చేసెను ఈ అద్భుతము

5. గగనతలముపై ఎగురు పక్షుల సముదాయమును
మహామత్స్యములను జలచరములను
రెక్కలుగల పక్షులను సృజియించెను
ఐదవ దినమందున చేసెను ఈ అద్భుతము

6. తన స్వరూపములో తన పోలికలో మానవుని
ఆశ్చర్యకరముగా రూపించెను ప్రభువు
స్త్రీ పురుషులుగా చేసి ఆశీర్వదించెను
ఆరవ దినమందున చేసెను ఈ అద్భుతము

7. దేవుడు తను చేసిన పనియంతయు
ఆరవ దినమందున ముగియించెను
ఈ రీతిగ దీవించి పరిశుద్ధపరచి
ఏడవ దినమందున విశ్రమించె దేవుడు

సృజియించిన సృష్టంతయు మంచిగ ఎంచి సంతృప్తి చెందెను. "అసమానదైవము"

## 2. పాపము ఆ.కా.

సృష్టికర్తయైన దేవుడు ఆదిమానవుణ్ణి సృజించాడు. ఏదేను వనాన్ని ఏలిన 3:6-7
మొదటి మానవుడు ఆదాము. ఆదిలోనే దేవుని ఆజ్ఞను మీరాడు. అప్పుడేం జరిగిందంటే... ఏదేను వనములో ఒక తోటను వేసి ఆదాము హవ్వలను అందులో ఉంచెను దేవుడు. వారిరువురు ఆడుతూ పాడుతూ ఆనందముగా జీవించుచుండిరి. దేవుడైన యెహోవా ఆదాముతో ఆ తోటలోని ప్రతి వృక్షఫలమును తినవచ్చును గాని మంచిచెడ్డల తెలివినిచ్చు వృక్షఫలములను నీవు తినకూడదు. తినిన దినమున నిశ్చయముగా మరణము చెందుదువు అని ఆజ్ఞాపించెను. హవ్వ ఒంటరిగా నుండినప్పుడు సాతాను సర్పములో ప్రవేశించి మానవస్వరముతో ఈ విధముగా మాటలాడెను. ఈ ఫలములను మీరు తినినచో చావనే చావరు. మీ కన్నులు తెరువబడును అనగానే హవ్వ ఆ ఫలములను తిని ఆదామునకును తినమని ఇచ్చెను. ఆదాము కూడ ఆ ఫలములను భుజించెను. వెంటనే వారి కన్నులు తెరువబడినవి. వారు దిగంబరులుగా మారిపోయిరి. దేవుని ఆజ్ఞను మీరి ఆ ఫలములను తినినందున దేవుడు ఏదేనులో నుండి వారిని వెడలగొట్టెను. అలా పాపము లోకములో క్రమేపి విస్తరిస్తూ వచ్చింది. అట్టి పాపస్థితిని పరిశుద్ధుడైన దేవుడు చూస్తూ సహించలేకపోయాడు. ఆ కారణంగా లోకము ఒక్కసారిగా సర్వశక్తుడైన దేవుని ఉగ్రతకు గురయ్యింది.

కాని ఇట్టి జలప్రళయాన్ని చూసి సంతాపం చెందిన దేవుడు మానవ
పాపపరిహారం నిమిత్తమై మానవునితో నిబంధన చేయసంకల్పించాడు. ఈ ఆది 6:8-9,
తరము వారిలో నీవే నా యెదుట నీతిమంతుడవైయుండుట చూచితిని అన్నాడు. 9:9-17



దేవుడు నోవహుతో అలా నోవహు యెహోవా దృష్టికి కటాక్షము పొందినవాడయ్యాడు. నోవహు నీతిమంతుడును తన తరములో నిందారహితుడైయున్నాడు. గనుక దేవుడు నోవహుతో ఈ నిబంధన చేశాడు. ఇక మీదట నరులను బట్టి భూమిని శపింపను. నేనిప్పుడు చేసిన ప్రకారముగా ఇకను సమస్త జీవులను సంహరింపను. దేవుడు నోవహును అతని కుమారులను చూచి ఇదిగో నేను మీతోను మీ తదనంతరము మీ సంతానముతోను నా నిబంధనను స్థిరపరచుచున్నాను. సమస్త శరీరులు ప్రవాహ జలముల వలన ఇకను లయపరచబడరు. భూమిని నాశనము చేయుటకు ఇకను జలప్రవాహము కలుగదు అని పలికెను. నా నిబంధనకు గురుతు ఇదే. నా ధనుస్సును మేఘములలో ఉంచితిని గదా. అది నాకును భూమికిని నిబంధనకు గురుతుగా ఉండును అనెను.

అబ్రహాముతో కూడ దేవుడు తన నిత్య నిబంధనను స్థిరపరచి తన ప్రజల్ని
ఎలా విమోచించి వారికి మహోజ్వల భవితను అనుగ్రహిస్తాడో నిబంధన ఆది 15:17
రూపంలో తెలిపాడు. ప్రొద్దు గ్రుంకపోయినపుడు భయంకరమైన కటిక చీకటి అతని క్రమ్ముగా దేవుడు నీ సంతతి వారు తమది కాని పరదేశమందు నివసించి వారికి దాసులుగా నుందురు. వారు నన్నూరు ఏండ్లు వీరిని శ్రమపెట్టుదురు. వీరు ఎవరికి దాసులగుదురో ఆ జనమునకు నేనే తీర్పు తీర్చుదును. తరువాత వారు మిక్కిలి ఆస్తితో బయలుదేరి వచ్చెదరు. నీవు క్షేమముగా నీ పితరులు యొద్దకు చేరుదువు. మంచి వృద్ధాప్యమందు పాతిపెట్టబడుదువు. నీ నాలుగవ తరమువారు ఇక్కడికి మరల వచ్చెదరని నిశ్చయముగా తెలిసికొనుము అనెను. ఐగుప్తు మొదలుకొని గొప్పనదియైన ఫెరాతను నది పర్యంతము ఈ దేశమును నీ సంతానమునకు ఇచ్చియున్నాను అనెను. అలాగే దేవుడు తన ప్రజలైన ఇశ్రాయేలీయులతో కూడా ఈ విధంగా నిబంధన చేశాడు. సినాయి పర్వముపై మోషేతో ఇశ్రాయేలీయులను గూర్చి దేవుడు వివరించిన నిబంధన.

నేను ఐగుప్తీయులకు ఏమి చేసితినో మిమ్మును గద్ద రెక్కలమీద మోసి నా
యొద్దకు మిమ్మునెట్లు చేర్చుకుంటినో మీరు చూచితిరి. కాగా మీరు నా
మాటలు శ్రద్ధగా విని నా నిబంధనను అనుసరించి నడచిన పక్షమందు నిర్గమ 19
మీరు సమస్త జనములలో, నాకు స్వకీయ సంపాద్యమగుదురు.

మీరు నాకు యాజకరూపకమైన రాజ్యముగాను, పరిశుద్ధమైన జనముగాను

ఉందురు అని చెప్పుమనెను. ఆ నిబంధనల క్రమములో సీనాయి పర్వతముపై దేవుడు మోషేకు పది ఆజ్ఞలను అనుగ్రహించి వాటిని తన ప్రజలు అనుసరించాలని ఆదేశించాడు. ఆది 19:3-6

**పది ఆజ్ఞలు**

**పల్లవి:**

పది ఆజ్ఞలు నీ హృదయములో పదిలపరచుకొని పాటించు.
ఆదర్శముగా జీవించు. నిర్గమ 20:3-17
నీ దేవుడై యెహోవాను నేనే. నేను తప్ప వేరొక దేవుడు నీకుండకూడదు.
ఇది మొదటి ఆజ్ఞ.
నీ దేవుడవైన యెహోవా నామమును వ్యర్థముగా ఉచ్చరింపకూడదు.
ఇది రెండవ ఆజ్ఞ.
విశ్రాంతి దినమును పరిశుద్ధ దినముగా ఆచరించుటకు
జ్ఞాపకముంచుకొనుము. ఇది మూడవ ఆజ్ఞ.
నీ తండ్రిని నీ తల్లిని సన్మానింపుము. ఇది నాల్గవ ఆజ్ఞ.
నరహత్య చేయకుము. ఇది ఐదువ ఆజ్ఞ.
వ్యభిచరింపకూడదు.
ఇది ఆరవ ఆజ్ఞ.
దొంగతనము చేయకుము ఇది ఏడవ ఆజ్ఞ.
నీ పొరుగువానిపై అబద్ధ సాక్ష్యము పలుకకుము ఇది ఎనిమిదవ ఆజ్ఞ.
నీ పొరుగువాని ఇల్లు ఆశింపకూడదు ఇది తొమ్మిదవ ఆజ్ఞ.
నీ పొరుగువాని భార్యనైనను, దాస దాసీనైనను, ఎద్దునైనను,
గాడిదనైనను, ఆశింపకూడదు. ఇది పదియవ ఆజ్ఞ.
పది ఆజ్ఞలు నీ హృదయములో పది లపరచుకొని పాటించు.
ఆదర్శముగా జీవించు.

## 3. నిబంధనలు :

తన ప్రమాణాలను నెరవేర్చు దేవుడు తన యిష్టానుసారుడైన దావీదుతో ఇలా నిబంధన చేశాడు. నీవు నీ పితరులతో కూడ నిద్రించిన తరువాత నీ గర్భములోనుండి వచ్చిన నీ సంతతిని హెచ్చించి రాజ్యమును అతనికి స్థిరపరచెదను. అతడు నా నామఘనత కొరకు ఒక మందిరమును కట్టించును. అతని రాజ్య సింహాసనమును నేను నిత్యముగా స్థిరపరచెదను. నేనతనికి తండ్రినైయుందును. అతడు నాకు కుమారుడై యుండును. అతడు పాపము చేసినయెడల నరుల దండముతోను మనుష్యులకు తగులు దెబ్బలతోను అతని శిక్షింతును. కానీ నిన్ను స్థాపించుటకై నేను కొట్టివేసిన సౌలుకు నా కృప దూరమైనట్లు అతనికి నా కృప దూరము చేయును. 2 సమూ 7:12-16

**క్రొత్త నిబంధన**

తన ప్రజలైన ఇశ్రాయేలీయులను ప్రేమించిన దేవుడు వారితో ఓ క్రొత్తనిబంధన చేశాడు. “ఇదియే ఇదియే నా నిత్యనిబంధన. నేడు నా ప్రజలతో నేను చేయు నిత్యమగు నిబంధన. వారిని విమోచించెదను. వారి మనస్సులలో నా ధర్మవిధిని ఉంచెదను. వారి హృదయములమీద దానిని వ్రాసెదను. నేను వారికి దేవుడనై యుండెదను. వారు నాకు జనముగా నుండెదరు. నేను వారి దోషములను క్షమియించి వారి పాపములను ఇక ఎన్నడు జ్ఞాపకము చేసికొనను. కనుక అల్పులేమి ఘనులేమి నన్నెరుగుదురు.” ఇర్మి 31:31-34

## 4. యేసు జననం

ఈ విధంగా ఇశ్రాయేలీయులకు దేవుడు చేసిన నూతన నిబంధన నెరవేర్పుగా పరిశుద్ధాత్మ ద్వారా కన్య మరియ గర్భాన దేవుడు నరావతారియై జన్మించాడు. తన మహా మహిమను వీడి పశుల పాకలో జన్మించిన లోకరక్షకుని గొల్లలు జ్ఞానులు ఆరాధించి కానుకలు అర్పించారు. పరలోక దూతలు స్తుతిగానాలతో ఆయనను కీర్తించారు. ఈ ప్రకారంగా యెషయా, యిర్మియా, జెకర్యాల ప్రవచనాలు నెరవేరాయి. యెషయ 7:14 :

**పాట:**

ప్రవచన రీతిగ ప్రవక్తలు – పలికిన రీతిగ యేసుప్రభు
వసుధలోన అవతరించెను – పాపశాపములు తొలగించెను.

1 యెషయా తెలిపిన విధంబుగా–ఉదయించెను మనకొక శిశువు (2) యెషయ
ఆశ్చర్యకరుడు ఆలోచనకర్త బలవంతుడు – మన యేసుప్రభు (2) 7:14 :
॥ప్రవ॥

2 భక్తవరుడగు యిర్మియా – ప్రవచన మూలంబుగా
దావీదునకు నీతి చిగురు – అంకురించునని ప్రకటించెను (2) ॥ప్రవ॥

3 చిగురుయను నా సేవకుని – రప్పింపబోవుచూన్ననని (2) **జెకర్యా 3:8**
జెకర్యా యను భక్తుని ద్వారా – పరమతండ్రి వినిపించెను(2) ॥ప్రవ॥

## 5. అద్భుతాలు - ఉపమానాలు :

**యోహాను 6:29**

సర్వ ప్రపంచ రక్షణకై జన్మించిన ప్రభువు బాలుడుగా, యవ్వనుడుగా, తన తల్లిదండ్రులకు విధేయుడుగా పెరిగి పెద్దవాడయ్యాడు. ఆయన ఈ లోకంలో ఉన్నప్పుడు ఎన్నో అద్భుతకార్యాలు చేశాడు. ఆయన చేసిన కార్యాలకు ప్రజలు ఆశ్చర్యచకితులయ్యారు. ఈ అద్భుతాల్ని ఉపమానాల్ని ప్రభువు చెయ్యటం, చెప్పటంలోని ఉద్ధేశ్యం మనము కూడా దేవుడు పంపిన క్రీస్తునందు విశ్వాసం ఉంచాలి అని. అదే దేవుని చిత్తము. ఆ విశ్వాసము దేవుని ద్వారా కలిగింది కనుక అది దేవుని క్రియయే (యోహాను సువార్త 6:29). ఈ విధంగా గ్రామ గ్రామాలను సంచరిస్తూ ఎన్నో అద్భుతకార్యాలను చేస్తూ కపెర్నహోమునకు చేరుకున్నాడు.

### పల్లవి:

తందాన తాన తందాన తానేతందానానా
తందాన తాన తందాన తానేతందానానా

**యోహాను 4:46-54**

కపెర్నహోములో ఒక ప్రధాని కుమారుడు రోగియై చావునకు సిద్ధముగా నుండెన్

ఆ ప్రధాని యేసునొద్దకు వచ్చి కుమారుని స్వస్థపరచుమని యేసును వేడెను తమ్ముడా భళానంటి భాయి తమ్ముడా.

అందుకు యేసు "నీవు వెళ్ళుము నీ కుమారుడు బ్రతికియున్నాడు" అని అతనితో చెప్పెను. ఆ మనుష్యుడు యేసు తనతో చెప్పిన మాటలు నమ్మి, విశ్వాసముతో వెళ్ళిపోయాడు. అంతట అతని దాసుడు ఎదురుగా వచ్చి ఏమన్నాడో తెలుసా? "నీ కుమారుడు బ్రతికాడయ్యా! యేసు స్వస్థపరచాడయ్యా! నీవింక దిగులు చెందనవసరం లేదు" అని ప్రధానితో అన్నాడు. అయితే యేసు మాటల్లోని ప్రత్యేకత ఏమిటి? యేసునోటనుండి మాట వెలువడగానే ఆయన మాటలోని ప్రభావ మహిమలు ఆ రోగిని బ్రదికించాయి. యేసు



మాట జీవపు ఊట. యేసు మాట నమ్మి బ్రతకటమే నిజమైన జీవిత బాట. ప్రభువైన యేసు శరీరధారిగా తన కొద్దికాలజీవితంలో ఎన్నో అద్భుతకార్యాలు, సూచకక్రియలు చేశాడు. వాటిని కళ్ళారా చూసి, చెవులారా విన్న ప్రజలు గుంపులు గుంపులుగా యేసును వెంబడిస్తూ వచ్చారు. ఒకానొక సమయంలో ఆయన బోధ ముగించిన అనంతరం ప్రజలు ఆకలిగొని యుండటం గ్రహించి, ఐదు రొట్టెలు రెండు చేపలతో ప్రభువు ఐదువేలమందికి ఎలా ఆహారం పెట్టాడో ఈ పాటలో విందామా?

**యోహాను 6:5-13**

వినుమా సోదర సోదరీ యేసు చేసిన అద్భుత క్రియలు
వినుమా సోదర సోదరీ యేసు చేసిన అద్భుతక్రియలను
గుంపులుగుంపులుగా జనులు తన యొద్దకు వచ్చుట చూచి
ఏమి చేయవలెనో యేసెరిగి

వీరు భుజించుటకు రొట్టెలను ఎక్కడనుండి తెప్పించుదమని ఫిలిప్పునడిగెను యేసయ్య. ఫిలిప్పును పరీక్షించటానికని యేసు ఆ విధంగా అడిగాడు. అప్పుడు ఆయన శిష్యులలో ఒకడైన అంద్రెయ ఏమన్నాడంటే

వినుమా సోదరా సోదరీ యేసు చేసిన అద్భుతక్రియలు
వినుమా సోదరా సోదరీ యేసు చేసిన అద్భుతక్రియలను

"ఇక్కడ ఒక చిన్నవాని దగ్గర ఐదు రొట్టెలు రెండు చేపలు ఉన్నాయి" అని ప్రభువుతో విన్నవించాడు. అప్పుడు యేసు ప్రభువువారు ఏంచేశారు. ఆ రొట్టెలనుపట్టుకొని కృతజ్ఞతాస్తుతులు చెల్లించి విరిచి వారికి వడ్డించాడు. అలాగే చేపలను కూడ వడ్డించాడు. ప్రజలు తినగా మిగిలిన రొట్టెముక్కలు పోగుచేసి 12 గంపలు నింపారు. ఐదు రొట్టెలు రెండు చేపలు ఐదువేలమందికి వడ్డించటం, మళ్ళీ అది మిగలటం నమ్మలేని నిజం.

వినుమా సోదరా సోదరీ యేసు చేసిన అద్భుతక్రియలు
వినుమా సోదరా సోదరీ యేసు చేసిన అద్భుతక్రియలు (2)

యేసు క్రీస్తు ప్రభువు చెప్పిన మాటలు మనము వినాలి. ఆయన చెప్పిన పని మనం చెయ్యాలి. అప్పుడు మన కన్నులు తెరవబడతాయి. పుట్టుగ్రుడ్డివాడొకడు అలాగే చేసి తన గ్రుడ్డితన్నాన్ని పోగొట్టుకున్నాడు. **యోహాను 9:6**

తందాన తందాన తానేతందానా
తందాన తందాన తానేతందానా
ఒకనాడు యేసుప్రభువు పోవుచుండగా
పుట్టుగ్రుడ్డివాడొకడు తారసపడెను
యేసు ప్రభువు వానిని చూచి నిలిచి పిలిచి
నేలమీద ఉమ్మివేసి, ఉమ్మితో బురదచేసి
వాని కనులపై బురదను పూసి,
సిలోయమను కోనేటికి వెళ్ళి కడుగుకొనుమనగా
అది విని కోనేరు చెంతకు బయలుదేరినాడు
తందాన తందాన తానేతందనానా
అది విని కోనేరు చెంతకు బయలుదేరినాడు
తందాన తందాన తానేతందనానా
కోనేటిలోనికి మెలమెల్లగా దిగి
ఆ నీటితో కళ్ళను కడుగుకొన్నాడు
చూపు పొందెను గంతులు వేసెను
యేసు మాట వినవలెను, చెప్పిన పని చేయవలెను
అప్పుడు మన కన్నులు తెరువబడును
తందాన తందాన తానేతందనానా

ఇలా ఎన్నో అద్భుతకార్యాలను చేస్తూ ఆయా ఉపమానాల ద్వారా ప్రభువు సువార్తను బోధించాడు. పోగొట్టుకున్న దానిని వెదకి సంపాదించటమెలాగో నేర్పించాడు. **యోహాను 6:29**

ఎవరికైనను పది వెండినాణెములు ఉండగా
ఒక నాణెము పోగొట్టుకొనియుండగా
దీపమును వెలిగించి ఇంటిని ఊడ్చి



అది దొరకువరకు దానిని వెదకరా
అటువలెనే మారుమనస్సు పొందిన పాపిని గూర్చి
దేవదూతల యెదుట సంతోషము కలుగునని ప్రభుయేసు బోధించెను వినుము సోదరా!

## 6. నేనే - నేనే

బైబిలు గ్రంథంలో దేవుడు అనేక పర్యాయాలు "నేను నేనే" అంటూ మనతో మాట్లాడుతూ అభయమిస్తున్నాడు. కష్టాల్లో, నష్టాల్లో ధైర్యం చెదరినప్పుడు ఇదిగో నేనున్నాను మిమ్మల్ని రక్షించటానికి అంటూ ఆదరిస్తున్నాడు. **మత్తయి 16:27**

ఇదిగో నేనే నేనే - ఇదిగో నేనే నేనే (2)
యుగయుగములలోనున్న దేవుడను (2)

1 జీవాహారము నేనే - జీవాహారము నేనే **యోహా 6:35**
నా శరీరమును తినువాడు ఆకలిగొనడు
ఇదిగో నేనే నేనే - ఇదిగో నేనే నేనే
యుగయుగములలోనున్న దేవుడను (2)

2 జగతికి వెలుగునె నేనే - జగతికి వెలుగును నేనే **యోహా 8:12**
గతికి వెలుగును నేనే
నన్ను వెంబడించువాడు చీకటిలో బ్రదుకడు.
ఇదిగో నేనే నేనే - ఇదిగో నేనే నేనే
యుగయుగములలోనున్న దేవుడను (2)

3 గొఱ్ఱెల ద్వారము నేనే - గొఱ్ఱెల ద్వారము నేనే- గొఱ్ఱెల ద్వారము నేనే **యోహా 10:7**
నా మందను నేను ఎరుగుదును. నా గొఱ్ఱెలు నా స్వరమును వినును
ఇదిగో నేనే నేనే - ఇదిగో నేనే నేనే
యుగయుగములలోనున్న దేవుడను (2)

4. మంచి కాపరిని నేనే - మంచి కాపరిని నేనే - మంచి కాపరిని నేనే **యోహా 10:14**
గొఱ్ఱెల కొరకు ప్రాణము అర్పించుదును-దారి తప్పిన వాటిని రక్షించెదను
ఇదిగో నేనే నేనే - ఇదిగో నేనే నేనే
యుగయుగములలో నున్న దేవుడను (2)

5. పునరుత్థానము జీవము నేనే – పునరుత్థానము జీవము నేనే **యోహా 11:25**
పునరుత్థానము జీవము నేనే
ఇదిగో నేనే నేనే – ఇదిగో నేనే నేనే
యుగయుగములలోనున్న దేవుడను (2)

6. మార్గము సత్యము జీవము నేనే –మార్గము సత్యము జీవము నేనే **యోహా 14:6**
మార్గము సత్యము జీవము నేనే
నా ద్వారానే తండ్రియొద్దకు రావలెను
సత్యసంపన్నుడను జీవదాతను
ఇదిగో నేనే నేనే – ఇదిగో నేనే నేనే
యుగయుగములలోనున్న దేవుడను (2)

7. నిజమైన ద్రాక్షావల్లిని నేనే – నిజమైన ద్రాక్షావల్లిని నేనే **యోహా 15:1**
నిజమైన ద్రాక్షావల్లిని నేనే
మీరు నాయందు నిలిచి యుంటేనే బహుగా ఫలించెదరు
ఇదిగో నేనే నేనే – ఇదిగో నేనే నేనే
యుగయుగములలోనున్న దేవుడను (2)

## 7. ప్రభు రాత్రి భోజనం :

**లూకా 22:17-21** **మార్కు 14:22** **మత్త 26:26**

సిలువలో మన కొరకై అర్పింపబడిన యేసు శరీరం జీవాహారం. ఆయన అమూల్య రక్తం జీవాధారం. యేసు తనకు సంభవింపబోవునవన్నీ ఎరిగినవాడై తన శిష్యులతో భుజించుటకు పస్కా ఏర్పాటు చేయబడింది. ఆయన ఒక రొట్టెను పట్టుకొని కృతజ్ఞతాస్తుతులు చెల్లించి దానిని విరిచి వారికిచ్చి “ఇది మీకొరకు ఇయ్యబడుచున్న నా శరీరము, నన్ను జ్ఞాపకము చేసికొనుటకు దీనిని చేయుడని” చెప్పెను. ఆ ప్రకారమే భోజనమైన పిమ్మట ఆయన గిన్నెను పట్టుకొని “ఈ గిన్నె మీ కొరకు చిందింపబడుచున్న నా రక్తమువలనైన క్రొత్తనిబంధన” అని పలికెను. దీనిని చేయుట ద్వారా ఆయన శిష్యులు ప్రభువు పానార్పణములో పాలుపొంది మీరు ఒకరినొకరు ప్రేమించుడను క్రొత్త ఆజ్ఞను పొందారు. అందుకే “ఇది నా శరీరము” అన్నాడు ప్రభువు. ఆయన మరణము ద్వారా పాతనిబంధన స్థానములో క్రొత్త నిబంధన తనకు తన ప్రజలకు మధ్య ఆవిష్కరించబడుతుందని ఉపదేశించాడు. పాపక్షమాపణకై తన రక్తాన్ని ధారపోశాడు. ఆయన శరీరము తినుట ద్వారా ఆయన రక్తమును త్రాగుట ద్వారా ఆయన బల్యర్పణములో పాలుపొందుట ద్వారా శిష్యులు మీరు ఒకరినొకరు ప్రేమించుడి అను ఆజ్ఞను పొందారు.

నీ శరీరము జీవాహారము – నీ రుధిరము జీవాధారము (2)
నీ శరీరము భుజియింతుము – నీ రక్తము పానము చేతుము
నీలో జీవించెదము – నీలో ఫలియించెదము (2)

1 మా కలుషములను తొలగించుటకై – నీ ప్రజలతో మమ్ము చేర్చుటకై
చిరజీవమును అందించుటకై – చేదు చిరకను స్వీకరించి
కలువరిలో నీ ప్రాణం – అర్పించితివా యేసుప్రభూ॥నీ శరీరము॥

2 అల్లరి మూకలు దౌర్జన్యముగా నిను వేధించిరి నా దేవా
రక్తపు ధారలు కారుచుండగా సిలువను మోసిన నా నాథా
కలువరిలో నీ ప్రాణం – అర్పించితివా యేసుప్రభూ॥నీ శరీరము॥

3 అసమానమగు ప్రేమను చూపి – ప్రాణదానము చేసితివి
మీలో మీరు ఒకరిని ఒకరు ప్రేమించుమని నేర్పితివి
కలువరిలో చూపిన కరుణను వర్ణింపలేనయ్యా ॥నీ శరీరము॥

# పార్టు – 2

## 8. పాప పరిహారం

**2 కొరింతి 5:15**

పాతనిబంధన కాలంలో యాజకులు ప్రజల పాప ప్రాయశ్చిత్తముకై మరల బలులను అర్పిస్తూ ఉండేవారు.

కాని మన ప్రధానయాజకుడైన క్రీస్తు కలువరి సిలువలో ప్రపంచ మానవ పాప విమోచనకై ఒకేసారి మృతిపొంది ఒకేసారి పాప ప్రాయశ్చిత్తం చేశాడు. మన పక్షంగా యేసుక్రీస్తు ప్రభువు చేసిన ప్రాయశ్చిత్తము ప్రాణబలిదానము పరిశుద్ధతల అవగాహన లేకుండా యేసు క్రీస్తు పరిచర్యను తెలిసికోలేము. ఒకరు ఎలా తన పాప పరిహారమునకై ప్రాయశ్చిత్తము చేయవలెనో బల్యర్పణము చేయవలెనో పరిశుద్ధతను సంతరించుకొనవలెనో మోషేతో కూడ దేవుడు ముచ్చటించాడు. ఆ ఆశయాన్ని పరిచర్యలో ఆచరిస్తూ రక్షణ ప్రణాళికను సంపూర్తి చేశాడు.

**పల్లవి:**

అందరిపాపముల కొరకు ఒకేసారి తన రక్తమును అర్పించెను
సిలువలో ప్రభువు పాపపరిహారార్థ బలిగా ప్రాణదానము చేసెను.
అందరిపాపముల కొరకు ఒకేసారి మృతి పొందెను ॥అందరి॥

1 తన స్వరక్తమును చిందించి విమోచనము కలిగించెను
మరణమును జయించుటచే అపవాదిని ఓడించెను
క్రొత్తనిబంధనకు ప్రభువు మధ్యవర్తియాయెను చూడు ॥అంద॥

2 కలుషములను తన రక్తముతో కడుగుట వలన యేసుప్రభు
పరిశుద్ధతను ప్రసాదించి తన స్వరూపముకు మార్చెను
అపవిత్రతను తొలగించి ఆనందము కలిగించెను ॥అందరి॥

3 మన పాపములకు మరణమును పొందవలసియుండగ మనము
మన కలుషములకు కలువరియు తానే మరణమునొందెను
కళంకమంతయు తొలగించి అనింద్యులనుగా చేసెను.

## 9. సిలువలో బలి

లోకంలో యేసుక్రీస్తుకు ఎన్నో కోణాల్లోంచి పరిశోధించి రకరకాలుగా అనుకుంటున్నారు. కాని ఆయనైతే దేవుని కుమారుడు. మన పాపాల్నించి విమోచించటానికి నింగినుండి నేలకు దిగివచ్చిన జగద్విమోచకుడు. ఏలయనగా ఎడ్ల యొక్కయు మేకల యొక్కయు రక్తము పాపములను తీసివేయుట అసాధ్యము. గనుకనే దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవానియందు విశ్వాసముంచు ప్రతి వాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను

**యోహాను 3:16, హెబ్రీ 10:4**

**పల్లవి:**

అదిగదిగో లోకపాపములు మోసుకొను దేవుని గొఱ్ఱెపిల్ల
అడుగులు తడబడుచున్నవి గొంతు తడారుచున్నది
కొరడాలు ఛెళ్ళుమన్నవి పిడిగుద్దులు ముఖమున గుద్దిరి
ముళ్ళకిరీటము పెట్టిరి ముఖమున ఉమ్మిని వేసిరి
అయ్యయ్యో యేసయ్యా నిన్ను దూషించినారా
అయ్యయ్యో యేసయ్యా నిన్ను ద్వేషించినారా



1 కరముల మేకులు కొట్టిరి – కాళ్ళల్లో గాయము చేసిరి
ప్రక్కను బల్లెము పొడిచిరి రక్తము నీరుగా కారగా
దాహముగొని నీవడుగగా చేదు చిరక నీకిచ్చిరా
యేసయ్యా ఎంత అపకారము నీకు చేసిరి
యేసయ్య ఎన్ని బాధలకు నిన్ను గురి చేసిరి ॥ అదిగదిగో॥

2 దురితాత్ములు అతి క్రూరముగా – హింసించిరి నిన్ను యేసు ప్రభు
అపనిందలను మోపుచు అపహాస్యము గావించిరి
కసితీరగ నిన్ను కొట్టుచు ఈడ్చుకొనుచుపోయిరి
యేసయ్య నీ రక్తమును నాకై కార్చితివి
యేసయ్య ప్రాణబలిదానము చేసితివి
"తండ్రీ, తండ్రీ, తండ్రీ! వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమియించుమని కోరితివి ॥అదిగదిగో॥

## 10. పునరుత్థానం :

ప్రభువు సిలువ మరణం పొంది పునరుత్థానుడైన అనంతరం తాను చెయ్యబోతున్న ఒక గొప్ప ఏర్పాటు గురించి శిష్యులను ధైర్యపరుస్తూ యోహాను 14:1-18 వచనాల్లో ఇలా అన్నారు. మీ హృదయములను కలవరపడనియ్యకుడి. నేను ఉండే స్థలాల్లో మీరును ఉండునట్లు మీ కోసం స్థలం సిద్ధపరచేందుకై వెళ్తున్నాను. నేను వెళ్ళి స్థలం సిద్ధ పరచి, మిమ్ములను తీసికెళ్ళే నిమిత్తం నేను మరలా వస్తాను. మిమ్మును అనాథలనుగా విడువను, మీ వద్దకు మరలా వస్తాను. నేను వచ్చేవరకు మీ వద్ద ఎల్లప్పుడు ఉండుటకై వేరొక ఆదరణకర్తను అనగా సత్యస్వరూపియగు ఆత్మను మీకు అనుగ్రహించునట్లు తండ్రిని వేడుకొంటాను. ఆయన మీతో కూడా ఉంటాడు. మీలో నివసిస్తాడు. అంటూ తాను వెళ్ళిన తరువాత తన స్థానంలో పరిశుద్ధాత్మను పంపించే విషయాన్ని సహితం ప్రభువు స్పష్టం చేశారు.
అలా ఆయన వెళ్ళి మన నిమిత్తమై చేయబోతున్న ఏర్పాట్ల గురించి వాగ్దానం చేసిన ప్రభువు...

**1 పేతురు 3:18-19**

కలువరిగిరిలో మన రక్షణకై మరణము పొందాడు, పాతిపెట్టబడ్డాడు, తిరిగి మూడవ దినమున మృత్యుంజయుడై లేచాడు. ఆయన మహార్భాటముతో,

విజయ ధ్వనులతో సమాధి నుండి లేచాడు. అనీతిమంతుల కొరకు నీతిమంతుడైన క్రీస్తు శరీర విషయములో చంపబడి ఆత్మ విషయములో బ్రదికింపబడి పాపముల విషయములో ఒక్కసారే శ్రమపడ్డాడు. అవిధేయులైన వారి యొద్దకు చెరలోనున్న ఆత్మల యొద్దకు ఆయన ఆత్మరూపిగానే వెళ్ళి వారికి ప్రకటించాడు.

పల్లవి : యేసు లేచెను సమాధి నుండి విజయగీతికలు పాడండి
మరణముపై విజయము సాధించి క్రీస్తు లేచెను ఆర్భాటముతో ॥యేసు॥

1. పెందలకడనే స్త్రీలు లేచి సమాధి చెంతకు చేరగా — లూకా
దానిపైన ఉంచిన రాయి తొలగియుండె ఆశ్చర్యముగా ॥యేసు॥ — 24:6
2. పరలోకమందలి దూత కనబడి వారితో ఈలాగున అనెను — లూకా
సజీవుడైన వానిని మీరు మృతులలో ఎందుకు వెదకుదురు ॥యేసు॥ — 24:5

## 11. రెండవ రాకడ :

లూకా 21:27

వేవేల పరిశుద్ధులతో యేసే వేవేగమై రానైయున్నాడు. శ్రావ్య సుస్వర ధ్వనులు పొంగారుచుండగా కోటానుకోట్ల దూతలు విజయవీణలు మ్రోగించుచుండగా యేసు వచ్చును. ఆర్భాటముతోను ప్రధానదూత శబ్దముతోను దేవుని బూరతోను పరలోకమునుండి ప్రభువు దిగివచ్చును. క్రీస్తు నందుండి మృతులైనవారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము ఏకముగా ఆకాశమండలమునకు మేఘముల మీద కొనిపోబడి సదాకాలము ప్రభువుతో కూడా ఉందుము. క్రీస్తు నందుండి మృతులైన వారు మొదట లేతురు.

**పల్లవి :**

వేవేల పరిశుద్ధులతో యేసు వేగమే రానైయున్నాడు (2)
మనము మహిమ శరీరము దాల్చి మధ్యాకాశము చేరెదము

1. కోటానుకోట్ల దూతలతో మన యేసు ప్రభువు దిగివచ్చును
విజయవీణలు మ్రోగగా పరమ వరుడు అరుదెంచును ॥వేవేల॥

2 గొఱ్ఱెపిల్ల పరిణయ విందుకు పిలువబడిన ధన్యజీవులు
పెండ్లి వస్త్రమును ధరియించి వివాహవేదికపై నుందురు ॥వేవేల॥



## 12. ఏసు ఎవరు?

ప్రియ సోదరా, సోదరీ, యేసంటే ఎవరనుకున్నారు? ఆయన అత్యున్నతుడు, అసమాన దైవం.

పల్లవి : ఎవరనుకున్నావు నీవు యేసు ప్రభువును?
ఎవరనుకున్నావు నీవు క్రీస్తు దేవుని?
యేసు అత్యున్నతుడు, యేసే అసమాన దైవము॥ఎవ॥

1. యేసే దేవుని కుమారుడు — మత్త
జగదుత్పత్తికి ముందే ఉన్న దేవుడు — 26:63-64
యేసే సర్వోన్నతుడైన దేవుడు
పాపాత్ముల రక్షింప వచ్చిన ప్రభువు

2. యేసు సృష్టికర్త జగతికి ఆయన లేకుండా ఏది కలుగలేదు — యెష 11:1
యేసే నిత్య స్తోత్రార్హుడు – యేసే ఆదియు అంతము

3. యేసే రాజులకు రారాజు
అధికారము ప్రభావము కలిగిన ప్రభువు — యెష 45:23
యుగయుగములలో ఉన్న దేవుడు
దావీదు తాళపు చెవి కలిగిన వాడు

4. ధవళ సింహాసనముపై పరిశుద్ధుడు — మత్త 19:28
ఆశీనుడైయుండుట మనము చూతుము
మహిమ రాజ్యములో మనమందరము
ఆనందించెదము పరవశించి ॥ఎవరనుకున్నావు॥

## 13. ఒకేసారి ప్రాణార్పణం :

కృప విస్తరింపవలెనని, కృప విస్తరింపవలెనని పాపములో నిలిచియుందామా? అట్లనరాదు. పాపము విషయములో చనిపోయిన మనము ఇక మీదట ఏలాగు దానిలో జీవించెదము? మనము క్రీస్తుతో

కూడా చనిపోయిన యెడల మృతులలో నుండి లేచిన క్రీస్తు ఇకను చనిపోడనియు మరణమునకు ఇకను ఆయన మీద ప్రభుత్వము లేదని ఎరిగి ఆయనతో కూడా జీవించుదమని విశ్వసించుడి.

1 ఆయన చనిపోవుట చూడగా పాపము విషయములో ఒక్కసారే చనిపోయెను గాని ఆయన జీవించుట చూడగా దేవుని విషయములో జీవించుచున్నాడు అటువలెనే మీరు కూడా పాపము విషయములో మృతులుగాను దేవుని విషయములో జీవితులుగా ఎంచుకొనుడి.

2 మీరు ఆత్మసంబంధమైన ఒక్క ఆహారమునే భుజించుచున్నారు మీరందరు ఆత్మసంబందమైన ఒక్క పానీయమును పానము చేయుచున్నారు. **1 కొరి10:3**

## 14. విశ్వాస ప్రమాణం :

యేసు క్రీస్తు వారి మహోన్నత ఉపదేశమేమిటంటే "మీరు అపోస్తలుల బోధయం దును, సహవాసమందును, రొట్టెవిరుచుటయందును, ప్రార్థన చేయుటయందును ఎడతెగక యుండుడి" అనేదే. **అ.కా. 2:42**

**సాకి:**

భూమ్యాకాశములను సృజియించిన...
సర్వశక్తిగల తండ్రియైన దేవుని నేను నమ్ముచున్నాను.
ఆయన ఏక కుమారుదును,... మన ప్రభువునైన యేసు క్రీస్తును నమ్ముచున్నాను.
ఈయన పరిశుద్ధాత్మ వలన... గర్భమున ధరింపబడి,
కన్యయైన మరియకు పుట్టి,... పొంతిపిలాతు అధికారము క్రింద శ్రమపడి,
సిలువ వేయబడి, చనిపోయి... సమాధి చేయబడెననియు,
అదృశ్య లోకములోనికి దిగెననియు,... చనిపోయిన వారిలో నుండి
మూడువ దినమున లేచి,... పరలోకమునకెక్కి సర్వశక్తిగల తండ్రియగు దేవుని కుడిచేతివైపున కూర్చుండియున్నాడనియు,
సజీవులకును మృతులకును తీర్పు చేయుటకు అక్కడనుండి వచ్చుననియు నమ్ముచున్నాను. పరిశుద్ధాత్మను నమ్ముచూన్నను, పరిశుద్ధ క్రైస్తవ సంఘమగు పరిశుద్ధుల సహవాసమును, పాప క్షమాపణయు, శరీరపునరుత్థానమును, నిత్యజీవమును ఉన్నవని నమ్ముచున్నాను. ఆమెన్, ఆమెన్, ఆ ... మేన్.



10